
శ్రేయస్కర మార్గం

*Salamati ka Raasta (Telugu)*

# శ్రేయస్కర మార్గం


మూలం :

**మౌలానా సయ్యద్ అబుల్ ఆలా మౌదూది (రహ్మాలై)**

అనువాదం :

**ఎస్.ఎమ్. మలిక్**



TRUST

ప్రకాశకులు:

**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్** (రిజిస్టర్డ్)

సందేశభవనం, లక్కడ్‌కోట్, ఛత్తాబజార్,

హైదరాబాద్-2. ఫోన్:040-24564583

**Sreyaskara Margam (Telugu)**

**TIP Series No. : 284**

Written by : Talib Hashmi

Translated by : Husna Batool Humairavi

*All Rights Reserved with Publishers*

First Edition : June 2015

Copies : 1,000

**Price : Rs.20**

ISBN : 978-93-81111-34-5

Published by : **Telugu Islamic Publications Trust (Regd.)**
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phone: 24564583
Fax : +91 +40 – 24576237
e-mail: geeturaiweekly@gmail.com

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

# శ్రేయస్కర మార్గం

మహాశయులారా!

'బజారులో ఒక దుకాణం ఉంది. దానికి యజమాని అంటూ ఒకడు లేడు, సరకు తెచ్చేవాడూ లేడు. అమ్మేవాడున్నూ లేడు; కాపలావాడు కూడా లేడు, దానంతట అదే వ్యవహరిస్తుంది ఆ దుకాణం. దానంతట సరకు వస్తుంది! కొనేవారికి అదే విక్రయమూ అవుతుంది' అని ఎవరయినా మీతో అంటే విశ్వసిస్తారా మీరు? ఒక దుకాణంలో సరుకు తెచ్చేవాడు లేకుండానే దానంతటదే సరుకు వచ్చేస్తుందంటే మీరు నమ్మగలరా? అమ్మేవాడు లేకుండానే సరకు అమ్మకమవుతుందంటే, కాపలా లేనిదే దొంగతనం, దోపిడీ జరక్కుండా ఉంటుందంటే ఒప్పుకుంటారా మీరు? కాస్త మీ ఆంతర్యాన్ని అడగండి. ఇలాంటి దుకాణం ఒకటి ఈ ప్రపంచంలో ఉందంటే బుద్ధీ వివేకాలున్న ఏ వ్యక్తికయినా మింగుడుపడే విషయమేనా ఇది?

'యజమాని లేని కర్మాగారం ఈ నగరంలో ఒకటుంది. ఇంజనీరు, మేస్త్రీ లాంటి వారు ఎవ్వరూలేరు, దానంతట అదే స్థాపితమయింది ఈ కర్మాగారం. యంత్రాలన్నీ స్వయంగానే తయారయ్యాయి. మరలన్నీ వాటి వాటి స్థానాల్లో అవే అమరుకున్నాయి. యంత్రాలన్ని స్వయంగానే నడుస్తూ ఉన్నాయి. ఇంకా, వాటి ద్వారా పరిపరి విధాల వస్తువులు తయారయి వెలువడుతూ ఉన్నాయి. నిజం చెప్పండి, ఈ విషయం చెప్పినవాని ముఖం కళ్ళప్పగించి చూడరా మీరు? అతని బుర్ర చెడిపోయిందేమో అన్న సంశయం కలగదా మీకు? ఏ మతిచెడిపోయినవాడో తప్ప ఈ వ్యర్థ

ప్రలాపం చేయగలవాడెవడు?

అంతెందుకు? ఈ విద్యుద్దీపం మీ ముందు వెలుగుతోంది. ఈ వెలుగు దీనిలో దానంతట అదే జనిస్తుందని ఎవరైనా అంటే మీరు విశ్వసిస్తారా? మీరు ఆసీనులై ఉన్న ఈ కుర్చీ దానంతట అదే తయారయిందని మహా గొప్ప మేధావులే చెప్పినా మీరు నమ్మగలరా?మీరు ధరించిన ఈ దుస్తుల్ని ఎవరూ నేయలేదు. అవే స్వయంగా నేయబడ్డాయని విశ్వ విద్యాంసుడే ఎవరయినా సెలవిస్తే మీరు దాన్ని స్వీకరిస్తారా? మీ ముందు నిటారుగా నిలబడ్డ ఈ కట్టడాన్ని నిర్మించినవాడు ఎవడూ లేడు. ఇది దానంతట అదే నిర్మితమయిందని ప్రపంచంలోని ప్రొఫెసర్లలందరూ కలిసి మిమ్మల్ని నమ్మమంటే ఇదంతా అర్థంలేని వ్యర్థ ప్రసంగం అని తోసిపుచ్చరా మీరు?

రేయింబవళ్ళు కానవచ్చే ఈ కొన్ని ఉదాహరణల్ని మీ ముందుంచాను. కాస్త గమనించండి. ఒక సాధారణ దుకాణం గురించి, అది స్థాపకుడు లేనిదే స్థాపించబడిందంటే, నిర్వాహకుడు లేనిదే వ్యవహరిస్తుందంటే మీ మస్తిష్కం దాన్ని అంగీకరించదు. ఒకచిన్న కర్మాగారం నిర్మించేవారు లేకనే స్వయంగా నిర్మితమయిందంటే, కార్యకర్తలూ, కార్మికులూ లేనిదేపని చేస్తుందంటే విశ్వసించేందుకు సిద్ధంగా లేరు మీరు. కాని భూమ్యాకాశాలబ్రహ్మాండమయిన ఈ కర్మాగారం మీ కనుల ముందు అహర్నిశలు పనిచేస్తూ ఉంది. ఇందులో సూర్యచంద్రాది అనేక గొప్ప గొప్ప గ్రహాలు గడియారపు మరల్లా తిరుగుతూ ఉన్నాయి. సముద్రాల్లో నుంచి నీటి ఆవిరి ఎగిరి గగనాన పోయి మేఘాల్లా మారిపోతుంది. పవనాలు వాటిని మోసుకుపోయి ప్రపంచంలోని నలుమూలల్లో పంపిణీ చేస్తాయి. యుక్తకాలంలో చల్లదనం చేకూర్చి ఆ ఆవిరి తిరిగి నీరుగా మార్చివేయ

బడుతుంది; ఆ నీరు వర్షబిందు రూపేణా ప్రాణికోటిపై వెదజల్లబడుతుంది. ఈ వర్షానికి ప్రతిఫలంగా నిర్జీవ భూగర్భంలో నుంచి సస్యశ్యామలమయిన వివిధ వృక్షాలు, పొదలు, తీగలు ఉద్భవిస్తాయి. రకరకాల ధాన్యాలు, బహురూపాల ఫలాలు, రంగురంగుల పుష్పాలు ఉత్పన్నమవుతాయి. ఈ కర్మాగారం గురించి, ఇదంతా ఒక నిర్మాత లేనిదే నిర్మించబడి, ఒక నిర్వాహకుడు లేనిదే నడుస్తూ ఉందంటే మీరెలా విశ్వసిస్తారు? సాధారణ కుర్చీ, గజం గుడ్డ, చిన్న గోడ లాంటివి వాటంతట అవే తయారయ్యాయని ఎవరయినా అంటే తక్షణం అతని మతి చలించిందని నిర్ణయిస్తారు కదా మీరు. అయితే, ఈ భువన భాండాలు వాటంతటవే ఉద్భవించాయని, పశు పక్ష్యాదులు వాటంతట అవే ఉనికిలోకి వచ్చాయని, మానవునిలాంటి చిత్ర విచిత్రమయిన వింత ప్రాణి తనంతట తానే సృష్టిలోకి వచ్చిందని చెప్పేవాని మతి చెడిపోవడంలో సందేహమేముంది మీ దృష్టిలో!

మానవుని దేహ నిర్మాణానికి కావలసిన మూల పదార్థాలన్నింటినీ శాస్త్రజ్ఞులు వేరుచేసి పరిశోధనలు జరిపారు. కాస్త ఇనుము, కొంత బొగ్గు, మరికొంత గంధకం, భాస్వరం, కాల్షియం, కాసిన్ని లవణాలు, కొన్ని వాయు పదార్థాలు ఇంకా ఇలాంటివే మరికొన్ని పదార్థాల మిశ్రమం వల్ల ఈ మానవ దేహం తయారయిందని యదార్థం తేలిపోయింది. వీటన్నింటి మొత్తం వెల కొన్ని రూపాయలకన్నా అధికంకాదు. మానవుని దేహంలో ఉన్న నిష్పత్తిలో ఈ పదార్థాల్ని ఒక్కొక్క దాన్నే తీసుకోండి. వాటిని మీకు తోచిన విధంగా మిశ్రమం చేయండి. ఏ విధంగానూ మానవుడు తయారు కాజాలడు. అయితే చూసే శక్తి, వినగలిగే శక్తి, మాట్లాడే శక్తి, నడిచే శక్తి గల ఈ మానవుడు, విమానమూ, రేడియో నిర్మించగలిగే ఈ మానవుడు

జీవంలేని ఈ రసాయనిక పదార్థాల ద్వారా ఏ నిపుణుని కార్యచాతుర్యం లేనిదే స్వయంగా తానే తయారయ్యాడనే వాదాన్ని మీరెలా అంగీకరించగలరు?

మాతృ గర్భ కర్మాగారంలో మానవుడు ఎలా రూపం దాల్చుతాడో ఊహించారా మీరు? తండ్రి చేసిన ఘనకార్యం ఇందులో ఏమీలేదు; తల్లి దూరదృష్టికి, చాతుర్యానికి దీనితో ఎలాంటి సంబంధంలేదు. సూక్ష్మదర్శిని సహాయం లేనిదే చూడనలవి కాని రెండు సూక్ష్మక్రిములు ఒక తిత్తిలో ఎప్పుడో కలుసుకుంటాయి. తల్లి రక్తం ద్వారానే వాటికి ఆహారం సరఫరా చేయబడుతుంది. పైన పేర్కొన్న ఆ గంధకం, భాస్వరం మొదలయినవే నిర్ణీత పరిమాణమూ, కన్నులు ఏర్పడవలసిన చోట కన్నులు, చెవుల స్థానంలో చెవులు, మెదడు దాని స్థానంలో, గుండె అమరవలసిన స్థలంలో గుండె, ఎముకలు వాటి స్థితిలో, మాంసం దాని రూపంలో– ఒక్కొక్క అంగం దాని దాని ప్రత్యేక స్థానంలో, విశిష్ట రూపంలో, సముచితమయిన పంథాలో అమరుకుంటుంది. తదనంతరం ఆ పిండానికి జీవం ప్రాప్తమవుతుంది. చూసే శక్తి, వినే శక్తి, రుచీ వాసనల శక్తులు ఇంకా ఎన్నో అమూల్యమైన అగణ్య శక్తులు దానికి ప్రసాదించబడతాయి. ఈవిధంగా మానవ నిర్మాణం పూర్తి అవగానే తొమ్మిది మాసాలు దీన్ని తయారు చేసిన ఆ చిన్న గర్భ కర్మాగారమే దీన్ని బలవంతంగా బయటికి నెట్టివేస్తుంది. ప్రతి దినమూ లక్షలాది మానవులు ఈ ఫ్యాక్టరీ నుంచి ఒకే నిర్మాణక్రమంలో తయారయి వెలువడుతున్నారు. కాని చిత్రమేమిటంటే, వీరిలో ప్రతి ఒక్కరి రూపం మరొకరిని పోలి ఉండదు. రూపురేఖలు వేరు, వర్ణ విశేషాలు వేరు, కంఠ స్వరాలూ వేరు, శక్తులూ సామర్థ్యాలు, సహజ గుణగణాలు, స్వరూప స్వభావాలు వేరు, భావాలు, చింతనా చాతుర్యాలు– ఒకటేమిటి,

ఎందులోనూ పరస్పరం వీరికి సామ్యముండదు. చివరికి ఒకే మాతృగర్భం నుంచి జన్మించిన ఇద్దరు సోదరులు సయితం పరస్పరం సమానం కాజాలరు. ఈ అనూహ్యమయిన వింతను చూసి బుద్ధి స్తబ్ధమయిపోతుంది. దీన్ని తిలకించినప్పటికీ అద్వితీయమైన ప్రౌఢిమ కలవాడు, మహోన్నత శక్తిశీలుడు, అనంత జ్ఞానవంతుడు, అనుపమ ప్రజ్ఞా నైపుణ్యాలు కలవాడు, అద్భుత మహిమోపేతుడయిన దేవుడు లేనిదే ఈ మహత్కార్యం అవుతోందని, కాగలదని చెప్పే వాని మతి చలించడంలో సందేహం లేదు. ఇలాంటి వ్యక్తిని వివేకం కలవాడని అనటం వివేకానికే అవమానకరం. ఈ భావాలు గల వ్యక్తితో ఒక సమంజసమైన సమస్యను చర్చించేందుకు కనీసం నేను మాత్రం సమ్మతించను.

## దేవుడు ఒక్కడే

ఆలోచన ఇంకా కాస్తముందుకు సాగనివ్వండి. ప్రపంచంలో ఎంత చిన్న కార్యమైనా, పెద్దకార్యమైనా అది నెరవేరడానికి బాధ్యతాయుతుడయిన నిర్వాహకుడు ఒక్కడే ఉండాలి. అప్పటికి గాని అది సక్రమంగానూ, సవ్యంగానూ నెరవేరజాలదని అంగీకరించనివారు బహుశ మీలో ఎవరూ ఉండరు. ఒక పాఠశాలకు ఇద్దరు హెడ్‌మాస్టర్లు ఉన్నట్లు, ఒక డిపార్ట్‌మెంట్‌ను అధికారులు ఇద్దరు నడిపించినట్లు, ఒక సైన్యాన్ని ఇద్దరు పాలకులు ఏలినట్లు మీరెప్పుడయినా విన్నారా? సందర్భవశాత్తు ఎక్కడయినా ఇలాంటి అనాచారం సంభవించినా ఒక్క రోజుకైనా ఆ ఏర్పాట్లు, ఆ కార్యక్రమం సవ్యంగా నడుస్తాయని మీరు భావించగలరా? మీ నిత్య జీవితంలోని చిన్న చిన్న వ్యవహారాల్లో మీకు అనుభవం కలగుతూనే ఉంటుంది. ఒక కార్యభారాన్ని ఒకరిని మించి అధికంగా ఎవరికయినా అప్పగించారా, ఆ పని దుర్వ్యవస్థకు లోనవుతుంది. పరస్పరం మనస్పర్థలు

ఏర్పడతాయి. చివరికి ఇంటి గుట్టు రచ్చకెక్కుతుంది. సుప్రబంధం, సువ్యవస్థ, సక్రమత, సువిధానం ఉన్నచోట నిస్సందేహంగా ఒకే నిర్వాహక శక్తి పనిచేస్తుంది; సర్వాధికారాలు గల ఒక వ్యక్తి చేతుల్లోనే కార్యరంగ మంతా ఇమిడి ఉంటుంది. ఇలాకాకుండా మరోవిధంగా సక్రమమైన ఏర్పాట్లను, క్రమబద్ధతను ఊహించడం కూడా అసాధ్యమే.

ఇంగిత జ్ఞానం గల ఏ వ్యక్తి అయినా ఇట్టే అంగీకరించగల సామాన్య విషయం ఇది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని మీ చుట్టు పట్ల ఉన్న ప్రపంచాన్ని కాస్త పరిశీలించండి. మహోన్నతమైన ఈ విశ్వం మీ కనులముందు సువిశాలంగా కళకళలాడుతోంది. నభాంతరాళాల్లో భ్రమరిస్తూ కనిపిస్తున్న కోటానుకోట్ల నక్షత్రాలు, మీరు నివసిస్తున్న ఈ పృథ్వి, రాత్రుల్లో ప్రకాశిస్తూ సంచరించే చంద్రుడు, దినమూ ప్రజ్వలిస్తూ ఉదయిస్తున్న సూర్యుడు, గురుడు, శుక్రుడు, శని, బుధుడు ఇంకా బంతుల్లా తిరుగుతున్న అగణ్యమైన ఈ గ్రహాలు– వీటన్నింటి భ్రమణాల్లో ఎలాంటి సుస్థిరమయిన క్రమబద్ధత ఉందో గమనించండి; నిర్ణీత సమయానికన్నా ముందు ఏనాడయినా రాత్రి అవడం చూశారా మీరు? కాలాన్ని మించి ఎప్పుడయినా జరిగిందా సూర్యోదయం? ఎప్పుడయినా భూమితో చంద్రుడు ఘర్షించుకోవడం తటస్థించిందా? దాని మార్గాన్ని ఏనాడయినా అధిగమించినట్లు గమనించారా సూర్యుణ్ణి? ఏ ఇతర గ్రహమయినా దాని నియమిత భ్రమణ మార్గాన్ని ఏ మాత్రమయినా తప్పినట్టుకన్నారా? విన్నారా? మన భూమికన్నా కోటానుకోట్ల రెట్లు పెద్దవయినవీ, సూర్యునికంటే వేలరెట్లు ఘనమయిన గ్రహాలు గల ఈ నక్షత్ర సమూహం గడియారపు యంత్రంలా పటిష్టమయిన ఒక నియమావళిలో బంధింపబడి ఉంది. వాటి వాటి నిర్ణీత వేగంతో, నిర్ణీత పరిధిలో అవన్నీ సంచరిస్తూ

వున్నాయి. ఏ ఒక్కదాని వేగంలోనూ రవ్వంత వ్యత్యాసం రాజాలదు. మరేదీ దాన్ని మార్గాన్ని ఇంచుకంతయినా తప్పిపోజాలదు. వీటి మధ్య ఏర్పరచబడ్డ పరస్పరానుబంధాల్లో ఒక క్షణకాలానికి ఇసుమంత వ్యత్యాసం ఏర్పడినా ఈ విశ్వవ్యవస్థ తారుమారయిపోతుంది. రైళ్ళు ఘర్షించుకున్నట్లే గ్రహాలు పరస్పరం ఘర్షించుకుంటాయి.

ఇవన్నీ ఆకాశపు విషయాలు. ఇక మన ధరణిపై, మన స్వవిషయాలపై కాస్త దృష్టి సారించి చూడండి. మట్టి బంతిపై కనుల పండువుగా ఉన్న ఈ జీవనలీల అంతా కొన్ని నిబంధనలకు లోబడివుంది. భూమ్యాకర్షణ సర్వ పదార్థాల్ని దాని కైవసం చేసుకుని ఉంది. ఒక్క క్షణ కాలానికి అది తన పట్టు విడిస్తే అంతే, ఈ కార్యరంగమంతా చిన్నాభిన్నమై పోతుంది. ఇందులో నియమింపబడ్డ నిర్వాహక వర్గమంతా ఒక నియమావళికి కట్టుబడి వుంది. ఈ నియమావళిలో ఎన్నటికీ మార్పు జరగదు. గాలి దాని విద్యుక్త ధర్మాన్ని పాటిస్తుంది. నీరూ దాని నియమావళిని జవదాటదు. వెలుతురుకై నియమింపబడిన ఆచరణా రీతిని అది నిర్వర్తిస్తుంది. శీతోష్ణాలకు వాటి నిబంధనలు వేరే ఉన్నాయి. మన్ను, రాళ్ళు, లోహాలు, వృక్షాలు, పశువులు, మిన్ను, ఆవిరి ఒకటేమిటి, దేనికీ అవధులు దాటే అధికారం లేదు. వాటి సహజ గుణ విశేషాలను మార్చుకునేందుకు విధించబడిన ధర్మాన్ని కాదనటానికి దేనికీ శక్యము కాదు.

వాటి పరిస్థితుల్లో వాటి వాటి నియమాలను పాటిస్తూ పరస్పర సహకారంతో మసలుకుంటాయి. ఈ కర్మాగారపు యంత్రాలన్నీ, ప్రపంచంలో జరిగే ఈ సమస్త యంత్రాంగం, సర్వశక్తులూ కలిసి పరస్పర సహకారంతో పనిచేయడం మూలానే జరుగుతోంది. మీరు భూమిలో నాటే

ఒక విత్తనాన్ని ఉదాహరణకు తీసుకోండి. భూమ్యాకాశాల సర్వశక్తులు కలిసి దాని పోషణలో భాగం పంచుకోకపోతే అది పెరిగి పెద్ద వృక్షంగా తయారవజాలదు. భూమి దాని గుప్తనిధులతో నుంచి దానికి ఆహారం సరఫరా చేస్తుంది. సూర్యుని ద్వారా దాని అవసరానికి తగినట్టు ఉష్ణం లభిస్తుంది. నీటిని కోరినప్పుడల్లా నీరు అందజేస్తుంది. గాలిని అర్థించిన వాటికి గాలి ఇస్తుంది. రాత్రులలో శీతలం మంచూ లభిస్తాయి. పగటి వేళలో ఉష్ణం, సూర్యరశ్మి చేత గట్టితనం చేకూరుతుంది. ఇలా నెలలూ సంవత్సరాల తరబడి సక్రమంగా ఆశ్రయమిస్తాయి, పోషిస్తాయి ఇవన్నీ, అప్పటికిగాని అదివృక్షంగా మారదు. ఫల పుష్పాదులు కాయవు. మీరు ఆధారపడి జీవిస్తున్న ఈ పంటలన్నీ అగణ్యమయిన వివిధ శక్తులు కలిసికట్టుగా పనిచేయడం వల్లనే పండుతున్నాయి. అంతేకాదు, భూమ్యాకాశాల శక్తులన్నీ కలిసి ఏకగ్రీవంగా మీ పాలనా పోషణలో నిమగ్నమై ఉండటం వల్లనే మీరూ జీవిస్తున్నారు. కేవలం ఒక్క గాలి మాత్రమే ఈ 'ఏకగ్రీవ వ్యవహారం'లో నుంచి తప్పుకుందంటే మీ అంతం సంభవిస్తుంది. గాలి, ఉష్ణాలతో నీరు సమరసమొందకపోతే ఒక్క వర్షపు బిందువూ మీపై పడజాలదు. మన్ను నీటితో ఏకీభవించడం మానివేస్తే మీ తోటలు వాడిపోతాయి, మీ పంటలు మాడిపోతాయి, మీ ఇండ్ల నిర్మాణమూ సాధ్యపడదు– అగ్గిపుల్ల రాజేయడంతో అగ్గి ఉత్పన్నం కానంటే మీ వంటిళ్ళు చల్లబడతాయి. ఇనుము అగ్గితో సంబంధాలు తెంపుకుంటే, రైళ్ళు,మోటార్లు అలాఉంచి ఒక గొడుగును సయితం తయారు చేయలేరు మీరు. మహోన్నతమైన ఈ రాజ్యంలోని శాఖలన్ని సంపూర్ణ సహకారంతో కట్టుదిట్టంగా ఆయా విధులు నెరవేర్చుతున్నాయి. ఇంకా, ఒక శాఖలోని కార్యనిర్వాహక శక్తి దాని విధిని తప్పడమో లేక ఇతర శాఖల

కార్యనిర్వాహక శక్తులకు నియమానుసారంగా అందజేయవలసిన సహకారాన్ని నిరాకరించడమో జరగటానికి తావులేదు. కనుకనే మనం జీవించే ఈ ప్రపంచం సుస్థిరంగా మనగలుగుతోంది.

నేను మీ ముందుంచిన ఈ విషయాల్లో అసత్యమైనదో, వాస్తవానికి విరుద్ధమయినదో ఏదయినా ఉందా? బహుశా మీలో ఎవ్వరూ దాన్ని అసత్యమని ఖండించరు. ఇది వాస్తవమే అయితే పటిష్టమయిన ఈ ప్రబంధం, అనూహ్యమైన ఈ సువ్యవస్థ, ఈ పరిపూర్ణ సమరసము భూమ్యాకాశాల అనేక వస్తువుల్లోనూ, శక్తుల్లోనూ సంపూర్ణ సమతూలనం-దీనంతటికీ కారణమేమిటి? కోటానుకోట్ల సంవత్సరాల తరబడి ఈ విశ్వం ఇలాగే సుస్థిరంగా వ్యవహరిస్తూ వస్తోంది. లక్షలాది ఏండ్ల నుంచి చెట్లు మొలుస్తూ ఉన్నాయి; పశువులు జీవిస్తూ ఉన్నాయి. ఇంకా అజ్ఞాత కాలం నుంచి మానవ సంతతి జీవిస్తోంది. చంద్రుడు భూమిపై పడిపోవడమో, భూమి సూర్యునితో ఘర్షించుకోవడమో ఎన్నడూ జరగలేదు. రేయింబవళ్ళ కాలాల్లో ఎలాంటి మార్పు సంభవించలేదు. 'వాయు శాఖ' ఏనాడూ 'జల శాఖ'తో కలహపడలేదు. మన్నుపై ఏనాడూ అలగలేదు నీరు; ఉష్ణం అగ్గితో తన బాంధవ్యాన్ని తెంపుకోలేదు. అయితే ఈ మహోన్నత రాజ్యపు సమస్త విభాగాలు, శాఖలు, కార్యనిర్వాహక శక్తులు, చట్టాలకు, కట్టుదిట్టాలకు కట్టుబడి ఉండడానికి కారణమేమిటి? వీటిలో కల్లోలం చెలరేగదెందుకు? అలజడి ఏర్పడదేం? ఏ కారణాన ఇవన్నీ ఒక వ్యవస్థలో కట్టుబడి ఉన్నాయో, మీ ఆంతర్యాన్ని అడగండి. ఈ విశ్వాన్నంతటికీ ఏకైక దేవుడే పాలకుడనీ, ఆయన ఆజ్ఞల ప్రకారమే సమస్తం నడుస్తుందనీ, అత్యంత పటిష్టమయిన శక్తి ఒక్కటే సర్వాన్ని తన నియమాల్లో బంధించి ఉందనీ మీ ఆంతర్యం బదులివ్వదా? పదో ఇరవయో అలా ఉంచి కేవలం ఇద్దరే

'భగవంతులు' ఈ విశ్వానికి యజమానులై ఉన్నా ఈ వ్యవస్థ సక్రమంగా సాగివుండేది కాదు. ఒక చిన్న పాఠశాల ఇద్దరు హెడ్‌మాస్టర్ల అధికారాన్ని భరించలేని సందర్భంలో, భూమ్యాకాశాల ఇంత గొప్ప రాజ్యం ఇద్దరు భగవంతుల యాజమాన్యంలో నిర్వహింపబడటం సాధ్యమవుతుందా? కాబట్టి ప్రపంచం ఏ కర్తలేనిదీ సృష్టించబడలేదు అన్నదొక్కటే యదార్థం కాదు. దాన్ని సృష్టించిన శక్తి కూడా ఒక్కటే అన్న విషయమూ సత్యమే. విశ్వకార్యకలాపాలన్నీ ఏ అధికారీ లేనిదే నిర్వహింపబడటం లేదు అన్నదొక్కటే వాస్తవం కాదు. ఆ అధికారి కూడా ఒక్కడే అన్నదీ వాస్తవమే. ఒకరికి మించి ఎవరి చేతుల్లోనూ పాలనాధికారాలు లేవని వ్యవస్థలోని క్రమబద్ధత ద్వారా విధితమవుతూనే ఉంది. ఒక్కగాను ఒక సర్వాధికారి శాసనాలే అమలులో ఉన్నాయన్నది విశ్వరాజ్యంలో గల ఈ నియమ బద్ధమయిన నిర్వహణ వల్ల వెల్లడి అవుతోంది. శాసనాల్లోని ప్రచండత, పటిష్టత భూమ్యాకాశాలకు ప్రభువు ఒక్కడే అని ఎలుగెత్తి చాటుతున్నాయి. సూర్యచంద్రాది గ్రహాలు ఆయనకే దాసోహమై ఉన్నాయి. భూమి దాని సర్వశక్తులు సమేతంగా ఆయన పాలనలోనేఉంది. గాలి, నీరు, నది, పర్వతాలు సర్వం ఆయనకే లోబడి వున్నాయి. చెట్లు చేమలు ఆయన ఆజ్ఞల్ని జవదాటలేకున్నాయి. మానవుని జనన మరణాలు ఆయన చేతుల్లోనే ఉన్నాయి. ఆయన పటిష్టమయిన బంధం సర్వవ్యాప్తమై ఉంది. తన ఆజ్ఞల్ని చెలాయించే శక్తి ఈ ప్రభుత్వంలో ఆయనకు తప్ప మరిదేనికీ లేదు. వాస్తవానికి ఈ వ్యవస్థలో ఒకరిని మించి ఇతరులకు ఆధిపత్యం ఉండడానికే తావులేదు. 'వ్యవస్థ' అన్నప్పుడు దాని శాసన నిర్మాణాధికారంలోగానీ, ఆ 'వ్యవస్థ'లో గానీ మరొకరు కలుగజేసుకో డానికి కూడా ఆస్కారముండదు. ఇది 'వ్యవస్థ' నైజం. ఒక్కడే సర్వాధిపతి. ఇతరేతరులంతా ఆజ్ఞల్ని

పాలించేవారుగా మాత్రమే ఉండగలరు. అలాకాక ఆధిపత్యంలో ఏ కొంత భాగం ఇతరులకు సంక్రమించినా వ్యవస్థ అస్తవ్యస్థంగా తయారవుతుంది; అరాజకం, విచ్ఛిన్నత, దుర్వ్యవస్థలు కూడా వ్యాపిస్తాయి.

శాసనంపై అమలు జరిపించడానికి శక్తి ఉంటేనే సరిపోదు జ్ఞానమూ అవసరమే. సువిశాల విశ్వాన్నంతటినీ ఒకే చూపులో చూడగలిగే దృష్టి, దాని అవసరాల ఔచిత్యాన్ని అర్థం చేసుకుని ఆజ్ఞల్ని జారీ చేసే సామర్థ్యం కూడా అవసరమే. 'విశ్వాధిపతి' ఒక్కడేకాక చిన్న చిన్న 'దేవుళ్ళు' విశ్వవ్యాప్తమైన దృష్టిలేనివారు– అనేకులు ఉండి వారికి ప్రపంచంలోని ఒక భాగంలోనో లేదా ఏదో ఒక వ్యవహారంలోనో తమ ఆజ్ఞల్ని చెలాయించే శక్తి ఉన్నట్లయితే భూమ్యాకాశాల ఈ సరంజామా అంతా చెల్లాచెదురవుతుంది. ఒక చిన్న యంత్రం సయితం దాని గురించి పూర్తిగా తెలియని వ్యక్తి జోక్యం చేసుకుంటే దుర్గతిపాలవుతుందన్న విషయం అందరికీ విదితమే. కనుక భూమ్యాకాశాల ఈ ప్రభుత్వ వ్యవస్థ అత్యంత క్రమబద్ధంగా నిర్వహించబడటం ద్వారా తేలే సత్యం ఒక్కటే; ఈ విశ్వరాజ్యపు పాలనాధికారాల్లో సర్వేశ్వరునికి ఒక్కనికే తప్ప మరెవ్వరికీ ఇసుమంత భాగమయినా లేదు. ఇదే మన బుద్ధి, వివేకాల తీర్పు.

ఇదొక సంభావిక విషయంకాదు. ఇదే వాస్తవం కూడా. దేవుని ప్రభుత్వంలో స్వయంగా ఆ ఏకైక దేవుని ఆధిపత్యం తప్ప మరెవ్వరి ఆధిపత్యమయినా ఆచరణలో ఉండడానికి కారణమే కానరావటంలేదు. ఆయన సృష్టి రచనాశక్తి వల్ల ఉనికిలో వచ్చిన వాటికి, నిరపేక్షాపరుడయిన స్వామి కరుణా కటాక్షాలకు దాసులైనవాటికి, తమ స్వీయ శక్తిసామర్థ్యాలపై ఒకక్షణమైనా మనజాలని వాటికి, ఆయన ఆధిపత్యంలో భాగస్వాములయ్యే

యోగ్యత ఎలా వస్తుంది? సేవకుడు తన యజమాని స్వామ్యంలో పాల్గొనడం ఎక్కడయినా చూశారా? యజమాని తన సేవకుణ్ణి తోటి భాగస్వామిగా చేసుకొనడం మీ బుద్ధికందే విషయమేనా? అంతెందుకు, మీ నౌకర్లలో ఏ ఒకనికైనా తమ ఆస్తిలోనూ, తమ అధికారాల్లోనూ భాగం పంచి ఇస్తారా మీరు? ఈ విషయాన్ని సావధానంగా యోచిస్తే దేవుని ఈ రాజ్యంలో ఆయన దాసులయినవారికి ఎవరికీ తమ స్వతంత్రాధికారాలు చలాయించే హక్కు లేదని మీ అంతర్యమే సాక్ష్యమిస్తుంది. ఇలా జరగడం కేవలం యదార్థానికి భిన్నమయిన విషయమేకాదు. బుద్ధి ప్రకృతి సిద్ధాంతాలకే విరుద్ధమయినది. అంతేకాదు అన్యాయం అసమంజసం కూడా.

## మానవ పతానానికి మూల కారణం

మహాశయులారా!

ఇవన్నీ ప్రపంచ వ్యవహారాన్ని నడిపిస్తున్న మౌలిక సత్యాలు. ఈ ప్రపంచం నుండి వేరుగా లేరు మీరు. దాని అంశంగానే జీవిస్తున్నారు. విశ్వానికంతటికీ ఈ యదార్థాలు ముఖ్యమైనట్లే మీ జీవితానికి సంబంధించి నంతవరకున్నూ ఇవి అతి ముఖ్యమైనవే. మీలో ప్రతి ఒక్కనికి, ఇంకా ప్రపంచంలోని మానవులందరికీ పరిష్కారం కాక వ్యాకులపరిచే చిక్కు ప్రశ్న ఒకటి నేడు తయారయింది.

మన జీవితాల నుంచి శాంతి సుఖాలు దూరమయ్యాయెందుకు? అనుదినం ఒక ప్రమాదం మనల్ని పీడించడానికి కారణమేమిటి? జీవన యంత్రాంగమే చెడిపోయిందే? జాతులు, దేశాలు పరస్పరం ఘర్షించుకుంటున్నాయి. దేశదేశాల మధ్య ద్వేషాలు ప్రబలిపోతున్నాయి.

మనిషే మనిషిని పీక్కు తింటున్నాడు. లక్షలాది మానవులు యుద్ధాలకు ఆహుతి అవుతున్నారు. కోటానుకోట్ల విలువ జేసే వ్యాపారాలు నాశనమవుతున్నాయి. గ్రామాలు, పట్టణాలు నేలమట్టమవుతున్నాయి. బలవంతులు బలహీనుల్ని మింగేస్తున్నారు. ధనవంతులు నిరుపేదల్ని దోచుకుంటున్నారు. ప్రభుత్వాల్లో దౌర్జన్యం, న్యాయస్థానాల్లో అన్యాయం, ధనంలో మదం, అధికారంలో అహంకారం, స్నేహంలో ద్రోహం, విశ్వాసంలో ఘాతుకం వచ్చి తిష్ట వేసుకున్నాయి. నడవడికలో నిజాయితీ నశించింది. మనిషి తోటి మనిషిని నమ్మశక్యంలేని పరిస్థితులేర్పడ్డాయి. మతం పేరుతో తమ విచ్ఛేదన కార్యాలు సాగుతున్నాయి. ఆది మానవుడైన ఆదమ్ సంతతి అసంఖ్యాకమైన వర్గాలుగా, విభాగాలుగా ఏర్పడింది. అంతేకాక ఒక వర్గంవారు, వంచనతో విశ్వాస ఘాతుకం ద్వారా ఇంకా వీలైనన్ని విధాల మరొక వర్గం వారికి హాని చేయడం పుణ్యకార్యంలా భావిస్తున్నారు. ఈ కీడులన్నింటికీ కారణమేమిటి? సృష్టి సర్వంలో ఎటుచూసినా అంతా శాంతిమయంగా గోచరిస్తుందే! నక్షత్రాల్లో, వాయువుల్లో, నీటిలో, చెట్లు చేమల్లో, పశుపక్షుల్లో అంతా ప్రశాంతంగా ఉందే! సృష్టి కార్యకలాపాలన్నీ సక్రమంగా, శాంతియుతంగా సాగుతున్నాయే! ఏ ఒక్క చోట కూడా విచ్ఛిన్నమో, దుర్వ్యవస్థ చిహ్నాలో కానరావటంలేదే! అయితే ఈ ఒక్క మానవుని జీవితమే ఈ మహాప్రసాదాన్ని– శాంతిని– ఎలా కోల్పోయింది?

ఇదొక గొప్ప సమస్య. దీన్ని పరిష్కరించడానికి జనులు ఎంతో శ్రమా, ఆందోళన పడుతున్నారు. దీని పరిష్కార మార్గం సూచించాలన్నదే నా ఉద్దేశ్యం. ఈ మార్గం పట్ల నాకు పూర్తిగా తృప్తి ఉంది. సంగ్రహంగా చెప్పాలంటే ఈ సమస్యకు సమాధానమొక్కటే– మానవుడు తనజీవితాన్ని

యదార్థానికి విరుద్ధంగా నిర్మించుకుని కష్టనష్టాల పాలయిన కారణాన దాన్ని యదార్థానుకూలంగా మార్చనంతవరకు శాంతిసుఖాలను పొందజాలడు. పరుగెత్తే రైలుబండిలో కూర్చుని దాని వాకిలిని మీ ఇంటి గడపగా భావించి దాన్ని తెరిచి, సాధారణంగా ఇంటి గడపలో నుంచి బయటికి అడుగు పెట్టినట్లు బయటికి వేంచేశారంటే మీరు భ్రమపడినంత మాత్రాన రైలుబండి వాకిలి మీ ఇంటి గడప అవుతుందా? మీరు పడిపోయే మైదానం మీ ఇంటి ప్రాంగణంగా మారుతుందా? మీ స్థానాన మీరు ఏమో ఊహించుకున్నంత మాత్రాన ఉన్న యదార్థం ఏమాత్రం మారదు. అతివేగంగా పరుగుత్తే రైలు నుండి మీరు బయటికి వేంచేసినప్పుడు ఏ పర్యవసానం జరగాలో అది జరిగి తీరుతుంది. కాలు విరిగి బుర్ర బ్రద్ధలయినప్పటికీ మీరు ఊహించుకున్నది తప్పని మీరు ఒప్పుకోకపోయినా సరే! అచ్చం ఇలాగే ఈ ప్రపంచానికి దేవుడంటూ ఒకడు లేడని మీరే స్వయంసిద్ధ దేవుళ్ళయి కూర్చున్నంత మాత్రాన లేదా దైవాన్ని కాదని మరెవరి ఆధిపత్యమో స్వీకరించినంతలో యదార్థం మారబోవడం లేదు. 'దేవుడు' తన దైవత్వాన్ని కోల్పోడు, పాలితులుగా మీరు నివసించే మహోన్నతమయిన ఈ విశ్వప్రభుత్వం సర్వాధికారాలు కేవలం ఆయనకే హస్తగతమై ఉంటాయి. ఇంతకు తమ భ్రమ అపోహల కారణంగా మీరు అనుసరించే జీవిత విధానం మూలాన మహా చెడ్డ పర్యవసానం అనుభవించడానికి మీరు సిద్ధమై ఉండవలసి వస్తుంది. ఆపదల్ని ఎదుర్కొన్నప్పటికీ తమ తప్పుడు జీవితాన్నే ఇంకా సరైనదిని మీరు భావిస్తూ ఉంటేమాత్రం జరిగేది జరక్కుండా ఉంటుందా?

ఇంతకుముందు పేర్కొన్న విషయాన్ని కాస్త పున:స్మరణ చేసుకోండి. సర్వలోక ప్రభువు ఇతరులు తన ప్రభుత్వాన్ని అంగీకరిస్తేనే ప్రభువు కాగలడని

లేదు. ఆయన ప్రభుత్వాన్ని స్వీకరిస్తేనే తప్ప ఆయన ప్రభువుగా మనలేడనేందుకు అలాంటి అగత్యం ఆయనకు లేదు. మీరు స్వీకరించినా, తృణీకరించినా ఆయన మాత్రం ప్రభువే. ఆయన ప్రభుత్వం స్వతహాగా దాని శక్తిసామర్థ్యాలపై ఆధారపడి వుంది. మిమ్మల్ని, ఈ ప్రపంచాన్నీ సృష్టించింది ఆయనే. ఈ భూమి, సూర్యచంద్రాదులు– ఒక్కటేమిటి ఈ విశ్వమే ఆయన అధికారానికి లొంగివుంది. ఈ జగత్తులో వ్యవహరిస్తున్న శక్తులన్నీ ఆయన ఆజ్ఞకు, అనుజ్ఞకు బద్ధులయి ఉన్నాయి. మీరు ఆధారపడి జీవిస్తున్న పదార్థాలన్నీ ఆయన హస్తగతమై ఉన్నాయి. స్వయంగా మీ ఉనికి కూడా ఆయన ఇచ్ఛకు లోబడి వుంది. మీరు ఈ విషయాలన్నీ ఒప్పుకోకపోయినా ఇదొక యదార్థం. మీరు ఏమీ ఎరగనట్టు దీన్ని ఉపేక్షించినా ఇదొకవాస్తవిక విషయం. దీన్ని కాదని మరే విధంగా మీరు ఊహించుకున్నా ఇదేసత్యం. ఏ పరిస్థితిలోను యదార్థ విషయంలో ఎలాంటి లోపం ఏర్పడదు. కాని, ఈ పరమ సత్యాన్ని స్వీకరించి, మీకివ్వబడిన నిజస్థాయి విలువల్ని అంగీకరించినట్లయితే మీ జీవితం బాగుపడుతుంది. జీవితంలో నెమ్మది, తృప్తి, శాంతి,సుఖాలు మీకు లభిస్తాయి. మీ జీవిత శకటం సక్రమంగా సాగుతుంది. ఇలాకాక ఈ వాస్తవిక విషయానికి భిన్నమయిన మరొక దృక్పథాన్ని మీరు స్వీకరిస్తారా– పరిగెత్తే రైలు బండి వాకిలిని ఇంటి గడపగా భావించి బయటికి అడుగువేసినప్పుడు కలిగే పర్యవసానమే కలుగుతుంది. గాయపడతారు మీరు; కాళ్ళు మీవే విరుగుతాయి; బుర్ర పగులుతుంది మీదే! బాధ మీకే కలుగుతుంది. 'వాస్తవం' మాత్రం చెక్కుచెదరక ఉండిపోతుంది.

ఈ యదార్థ విషయానికి అనుగుణంగా మన నిజ స్థానం ఏదని అడుగుతారా? ఒక నౌకరుకు వేతనమిచ్చి మీరు పోషిస్తున్నారంటే అతని

నిజ స్థానం వాస్తవ పరిస్థితులేవి? మీ సేవజేయడం, మీ ఆజ్ఞల్ని పాలించడం, మీ ఇచ్ఛానుసారంగా కార్యనిర్వాహణగావించడం, ఇంకా, తన నిర్ణీత అవధుల్ని దాటకుండా వ్యవహరించడం– ఇంతేగా? తన విధ్యుక్త ధర్మాన్ని పాటించడం కన్నా సేవకునికి వేరే పనేముంది? మీరొక ఉన్నతాధికారి అనుకోండి. మీ క్రింది ఉద్యోగి బాధ్యత ఏమిటి? అధికార కాంక్షతో ఊహాజగత్తులో విహరించకుండా మీరు ఇచ్చిన బాధ్యతల్ని నెరవేర్చడమే కదా! మీరొక ఆస్తి పరులైతే దాని ఎడల మీ అభిలాష ఎలా ఉంటుంది? అందులో మీ అభీష్టం ప్రకారం పనులు జరగాలనీ, మీ కోరికలే నెరవేరాలని, మీ సమ్మతి లేనిదే గడ్డిపోచ కూడా కదలకూడదనీ– ఇవేగా మీరు అభిలషించేది?

మీరు ఒక ప్రభుత్వం క్రింద జీవిస్తున్నారు; సర్వశక్తులు దాని అధీనంలో ఉన్నాయి. అయితే దాని ముందు మీస్థానం, మీ పరిస్థితి ఎలాంటిది? ఆ ప్రభుత్వానికి విధేయులయిన పాలితులుగా ఉండటానికి అంగీకరించవలసిందే కదా! ఇంకా, ప్రభుత్వ చట్టాల్ని మీరకుండా ప్రభుత్వానికి లొంగి ఉండడమే శరణ్యం కాదా!! ఈ ప్రభుత్వపు అండలో ఉంటూ మీరు తమ ఆధిపత్యాన్ని ప్రకటించుకోవడమో లేదా ఇంకొకరి ప్రభుత్వాన్ని స్వీకరించి దాని ఆజ్ఞల్ని పాలించడమో జరిగితే మీరు రాజద్రోహులు కారా? ద్రోహుల పట్ల అవలంభించబడే ప్రవర్తన మీకు నేను వేరే చెప్పనక్కర్లేదు.

ఈ ఉదాహరణల ద్వారా, దేవుని ఈ సర్వవ్యాప్తమయిన రాజ్యంలో మీ నిజస్థానం మీరే స్వయంగా గ్రహించుకోగలరు. ఆయన మీ సృష్టికర్త, మీ సృష్టికర్త అభీష్టానుసారం వ్యవహరించడమే సహజంగా మీ కర్తవ్యం.

ఆయన మిమ్మల్ని పోషిస్తున్నాడు, ఆయన నిధుల్లో నుంచి మీరు మీ జీవనోపాధి పొందుతున్నారు. ఆయనకు సేవకులుగా ఉండడం తప్ప మరే అంతస్తూ హోదా మీకు లేదు. మీకూ, సర్వలోకానికీ అధికారి ఆయనే. ఈ ప్రభుత్వంలో మీరు కార్యకర్తలు మాత్రమే. ఈ భూమ్యాకాశాలు సర్వం ఆయన సొత్తే. ఇందులో ఆయన అభీష్టమే నడుస్తుంది– అదే నడవాలి కూడా!

ఇక్కడ యధేచ్ఛగా వ్యవహరించడానికి మీకు ఎలాంటి అధికారం లేదు. తమ అభీష్టాన్ని సాగించడానికి ప్రయత్నించారా, చెడిపోతారు. ఆయన ప్రభుత్వం దాని స్వశక్తి మీద స్థిరంగా వుంది. భూమ్యాకాశాల్లోని వివిధ శాఖలన్నీ ఆయన హస్తగతమై ఉన్నాయి. మీరు అంగీకరించినా, ఆగ్రహించుకున్నా మీరు కేవలం ఆయన అండలో పాలితులయిన ప్రజలు మాత్రమే. దీన్నిమాత్రం కాదనగలమా? మీరున్నూ, ఇంకా పెద్దలనబడేవారున్నూ, సామాన్యులబడేవారునూ, మానవులందరున్నూ ఆయనకు పాలితులుగా జీవించడం కన్నా మార్గాంతరం లేదు. ఆయన శాసించినదే ఈ రాజ్యంలో శాసనం, ఆయన ఇచ్చినదే ఆజ్ఞ!

'నేను రాజాధిరాజును. మహా ఘనత వహించినవాణ్ణి. నిరంకుశ పాలకుణ్ణి, సర్వాధికారిని' అని వాదించే అధికారం పాలితులయిన మానవులకు ఎలా సంక్రమిస్తుంది?దైవాన్ని త్రోసిపుచ్చి దైవాదేశాల సమక్షంలో కృత్రిమ శాసనాన్ని ఒకదాన్ని స్వతహాగా నిర్మించి దేవుని దాసులైన మానవుల్ని 'దీన్ని పాటించండి' అని పురమాయించేందుకు ఏ వ్యక్తికయినా, ఏ పార్లమెంటుకైనా, ఏ శాసనసభకైనా, ఏ శాసనమండలికయినా దేవుని ఈ రాజ్యంలో ఎలాంటి అధికారమూలేదు.

మానవులు కల్పించుకున్న మరే రాజకీయ వ్యవస్థకయినా దైవాదేశాల అగత్యము లేకుండా స్వయంగా ఒక శాసనాన్ని జారీచేసి దానిని శిరసావహించమని ప్రజల్ని నిర్బంధించే హక్కు లేదు. నిజప్రభువుకు విధేయులయి ఉండక మిథ్యా ప్రభుత్వవాదుల కాల్పనిక ప్రభువుల విధేయతను స్వీకరించడం, నిజ పాలకుని శాసనాన్ని త్యజించి, కృత్రిమ 'శాసనకర్త'ల చట్టాలను అంగీకరించడం, నిజాధికారిని కాదని మిథ్యాపాలకుల ఆజ్ఞల్ని పాలించడం ఒక వ్యక్తికి, ఇంకా ఒక సమాజానికి ఏవిధంగానూ సముచితం కాదు. ఇవన్నీ విద్రోహానికి మారు రూపాలే. తన స్వంత ప్రభుత్వాన్ని ప్రకటించడం లేదా ఇలాంటి మానవులు ఏర్పరచుకున్న ప్రభుత్వానికి లొంగిపోవడం, పాలిత ప్రజానీకం చేసే ఈ రెండు చర్యలున్నూ విద్రోహానికి సమానమయినవే; రెంటికీ శిక్ష లభించడం ఏనాటికయినా తథ్యం.

మనలో ఒక్కొక్క వ్యక్తి లలాటకురులు దేవుని పిడికిలిలో ఉన్నాయి. తాను తలచినప్పుడు ఎప్పుడయినా మనల్ని పట్టి ఈడ్చగలడాయన. భూమ్యాకాశాల ఈ రాజ్యం నుండి పారిపోయే శక్తి ఎవ్వరికీ లేదు; తప్పించుకుని మరెక్కడా శరణు పొందలేరు. మన్నుతో కలిసి మీ అణువణువూ చెల్లాచెదరయినా; అగ్నిలో దహనమై మీ బూడిద గాలిలో కలిసిపోయినా, నీటిలో మునిగి మీ దేహం చేపలకు ఆహారమైనా లేదా సముద్రంలో మునిగి కరిగిపోయినా, మరెక్కడుండినా దేవుడు మిమ్మల్ని రప్పించుకోగలడు. వాయువు ఆయన బానిసే, భూమి ఆయన దాసియే. నీరు, చేపలు సర్వం ఆయన ఆజ్ఞలకు తలొగ్గినవే! ఒక్క సంజ్ఞలో అన్నివైపుల నుండి మీరు పట్టుబడతారు. అప్పుడు ఆయన మీలో ఒక్కరినే పిలిచి 'నా

పాలితులై ఉండి, తమ స్వేచ్ఛాధికారాలను ప్రకటించుకునే హక్కు మీకెలా లభించింది? నా రాజ్యంలో మీ ఆదేశాలు చెలాయించే అధికారాలు మీకెక్కడివి? నా ప్రభుత్వంలో మీ శాసనాలు జారీ చేసేందుకు మీరెవరు? నా దాసులై ఇతరులకు దాస్యం చేయడానికి మీరేవిధంగా సమ్మతించారు? నా నౌకరులై ఇతరుల ఆజ్ఞలను శిరసావహిస్తారా? నేనిచ్చే జీవనోపాధి ఆరగిస్తూ ఇతరులను అన్నదాతలుగా, పోషకులుగా పరిగణిస్తారా? నా బానిసలై ఉండి ఇతరుల సేవ చేస్తారా? నా రాజ్యంలో జీవిస్తూ అన్యుల ప్రభుత్వాన్ని సమ్మతిస్తారా? ఇతరుల శాసనాన్ని శాసనంగా స్వీకరిస్తారా? ఇతరుల ఆజ్ఞల్ని పాలిస్తారా? ఇది విద్రోహం కాదా? మీరు ఇలా ఆచరించడం న్యాయమేనా?'అని ప్రశ్నిస్తాడు.

ఇక చెప్పండి, మీలో ఎవరి వద్ద ఈ 'ధర్మారోపణ'కు జవాబు ఉంది? ఏ ప్లీడరుగారు తనకు గల వాదనా ప్రజ్ఞను ప్రదర్శించి మీకు ముక్తి మార్గం చూపగలరు? ఈ విద్రోహ నేరానికి ఇవ్వబడే శిక్ష నుండి ఏ పలుకుబడి ప్రయోగించి రక్షణ పొందే భరోసా ఉంది మీకు?

## అత్యాచారానికి మూలం

మహాశయులారా!

మానవునికి స్వేచ్ఛగా వ్యవహరించడానికి హక్కున్నదా లేదా? అన్న ప్రశ్న ఒకటే కాదు. దేవుని ఈ ప్రభుత్వంలో రాజరికానికీ, శాసన నిర్మాణానికీ లేక పరిపాలనకు ఏ మానవునికయినా యోగ్యత ఉందా? అన్నది కూడా ముఖ్య ప్రశ్నే. ఒక యంత్రం గురించి ఎరుగని మూఢ వ్యక్తి దాన్ని నడిపించడానికి ప్రయత్నిస్తే దాన్ని దురవస్థపాలు చేస్తాడని ఇంతకుముందే చెప్పడమయింది. డ్రైవింగ్ తెలియని ఒక వ్యక్తి చేత ఒక

మోటారు కారునే నడిపించి చూడండి కొద్ది క్షణాల్లోనే ఈ 'తెలివితేటల' పర్యవసానం తేలిపోతుంది. మీరే కాస్త ఆలోచించండి. సరయిన జ్ఞానం లేకుండా సాధారణ ఉక్కు యంత్రం లాంటిదాన్నే ఉపయోగించ శక్యం కాదే. అలాంటప్పుడు, ఎంతో చిత్ర విచిత్ర మనస్తత్వాల మానవుల జీవిత వ్యవహారాలకు అసంఖ్యాకమయిన రూపాలు, ఒక్కొక్క రూపానికి లక్షలాది సమస్యలు, ఇలాంటి పరిపరి విధాల చిక్కులతో నిండిన యంత్రాంగాన్ని ఈ వ్యక్తులేనా నడిపించేది? ఇతరుల మాట అలా ఉంచి స్వవిషయమే సరిగా తెలియదు వీరికి. తమ్ము తామే అర్థం చేసుకోలేరు వీరు. ఇలాంటి 'అజ్ఞానులు' మానవ జీవితాన్ని నడిపించాలని తలిస్తే దాని పర్యవసానమేమవుతుంది? డ్రైవింగ్ తెలియని వ్యక్తి కారు నడిపిస్తే కలిగే పరిణామం కన్నా భిన్నంగా వుంటుందా? అందుకే దైవాన్ని కాదని మానవులునిర్మించిన శాసనాలు అమలులో ఉన్న చోట దైవాజ్ఞపాలనా ప్రమేయం లేకుండా మానవుల కాల్పనిక శాసనాన్ని ఆచరణలో తెచ్చి మానవులు దాన్ని శిరసావహించిన చోట,ఎక్కడా శాంతి కానరావటం లేదు. మానవునికి తృప్తి, సుఖం ప్రాప్తమవలేదు. మానవ జీవన యంత్రం సక్రమంగా నడవడంలేదు. రక్తపాతం కడు సామాన్యమయిపోయింది. అన్యాయం, అత్యాచారం సర్వవ్యాప్తమైపోయాయి. దోపిడీలు, దుండగాలూ ప్రబలిపోయాయి. తోటి మానవుడి రక్తం పీల్చి దాహం తీర్చుకుంటున్నాడు మానవుడు. నీతి నిజాయితీ పూజ్యమైపోయాయి. ఆరోగ్యాలు అస్తవ్యస్తమయ్యాయి. దైవం మానవునికి ప్రసాదించిన సర్వశక్తులూ మానవ కళ్యాణానికి బదులు వినాశనానికి సాధనాలయ్యాయి. సాధక బాధకాలు తనకు తెలియకపోయినా పసివానిలా మారాము చేసి ఈ యంత్రాన్ని నడిపించే ప్రయత్నం చేశాడు మానవుడు. ఇదే మానవుడు చేతులారా

నిర్మించుకున్న శాశ్వత నరకానికి మూలకారణం. మానవుని జీవిత యంత్రంలోని మర్మాలు దాన్ని సృష్టించినవానికే తెలుసు. దాని నైజం ఎలాంటిదో ఎరిగినవాడు ఆయనే, ఇది సక్రమ మార్గంలో నడిచే విధానం కూడా ఆయనకే తెలుసు. మానవుడు అవివేకాన్ని విడిచిపెట్టి తన అజ్ఞానాన్ని అంగీకరించి యంత్ర నిర్మాత నిర్ణయించిన నియమావళికి కట్టుబడినట్లయితే చెడిపోయినదంతా తిరిగి సరికాగలదు; లేకపోతే ఈ ఆపదలకు అంతమంటూ కష్టాలకు పరిష్కారమంటూ సాధ్యపడదు.

## న్యాయం ఎందుకు కరువయింది?

కాస్త లోతుగా ఆలోచిస్తే మన జీవితాల దురవస్థకు అజ్ఞానమేకాక మరొక కారణం కూడా గోచరిస్తుంది.

'మానవుడు' 'మానవత్వం' అనే పదాలు ఒక వ్యక్తికి, కుటుంబానికి లేక ఒక జాతికి సొంతం కావని సామాన్య జ్ఞానమున్న ఏ వ్యక్తికయినా ఇట్టే బోధపడగలదు. ప్రపంచంలోని మానవులంతా ఎటొచ్చీ మానవులే కదా! మానవులందరికీ జీవించేహక్కు ఉంది. తమ అవసరాలను పూర్తి చేసుకునే అధికారం ఉంది. శాంతికి, న్యాయానికి, ఘనతా గౌరవాలకు అందరూ అర్హులే. మానవ శ్రేయం అంటూ ఒకటుంటే అది ఒక వ్యక్తి శ్రేయమో, ఒక కుటుంబ శ్రేయమో, ఒక జాతి శ్రేయమో కాదు. అది సర్వ మానవ శ్రేయమే కాగలదు. అలాకాక ఒక వ్యక్తి శాంతి సుఖాలు కలిగి, పది మంది అశాంతి అవస్థల్లో పడి వుంటే మానవాళి సుఖశాంతులు కలిగివుందని అనడం సబబా? మానవ కళ్యాణం అంటే అది సర్వ మానవ కళ్యాణమే కాని, ఒక తెగ లేదా ఒక జాతి కళ్యాణం కాదు. ఒక వ్యక్తి సుఖంగా ఉండి పది మంది దురవస్థ పాలవుతే దాన్ని మానవ కళ్యాణ

మంటామా? ఈ విషయాన్ని మీరు అంగీకరిస్తే మానవ సుఖశ్రేయాలు, మానవ కళ్యాణం ఎలా ప్రాప్తించగలవో యోచించి చూడండి. నన్నడిగితే దీనికి ఒక్కటే సమాధానం. మానవులందరినీ సమాన దృష్టితో చూడగలిగినవాడే మానవ జీవితానికి సంబంధించిన సిద్ధాంతాలు, నిబంధనలు నిర్మించాలి. నిస్వార్ధ పరుడయినవాడు, ఏ కుటుంబంతోను, ఏ తెగతోను, ఏ జాతితోను, ఎలాంటి స్వలాభాలతోనూ పొత్తులేనివాడే అందరి హక్కులు న్యాయరీత్యా నిర్ణయించాలి. ఆజ్ఞలివ్వడంలో అజ్ఞానం చేత పొరబడనివాడు, పాలనాధికారాలను మనోకాంక్షల్లో పడి అనుచితంగా దుర్వినియోగపరచనివాడు, ఒకనికి అనుకూలతను, మరొకనికి ప్రతికూలతను పాటించనివాడు, ఒకనిపట్ల అభిమానం, మరొకని పట్ల ద్వేషభావం లేనివాడు– అలాంటి వానికే సర్వ మానవుల్ని సమంగా పాలించే యోగ్యత ఉంటుంది. ఇలా జరిగినప్పుడే న్యాయం స్థాపితం అవుతుంది. ఈవిధంగానే సర్వ మానవులకు, జాతులన్నింటికీ, సమస్త తెగలకు వారు వారు సముచితంగా పొందవలసినవి ప్రాప్తించగలవు. అత్యాచారం సమసిపోవాలంటే ఇదొక్కటే మార్గం.

ఇక మీతో ఒక ప్రశ్న! ఇలాంటి సంబంధ రహితుడు, ఇంతటి నిష్పాక్షిక దృష్టి కలవాడు, ఇంత నిరపేక్షాపరుడు, మానవీయ బలహీనతలకు అతీతుడు కాగలవాడు ఈ ప్రపంచంలో మానవుడు ఎవడయినా ఉన్నాడా? బహుశా మీలో ఎవ్వరికీ 'కలడ'ని సమాధానమిచ్చే సాహసం లేదనుకుంటా.

ఇంతటి ఔన్నత్యం దైవానికి మాత్రమే తగును. మరొకడు ఈ ఘనతకు అర్హుడు కాడు. మానవుడు ఎంత విశాల హృదయుడయినా అతనికి కొంత స్వార్థమంటూ ఉండకమానదు. కొన్ని మమతలు మక్కువలూ

ఉంటాయి. కొందరితో అతనికి అనుబంధాలు దృఢంగాను, మరికొందరితో స్వల్పంగానూ ఉంటాయి. ఒకరియెడల ఉన్న ప్రేమాభిమానాలు మరొకరి పట్ల ఉండవు. కొందరితో ప్రగాఢమైన బాంధవ్యం ఉంటే మరికొందరితో అది శూన్యం. ఈ లోటుపాట్లు లేని మానవుడే ధరణిలో లేడు. అందువల్లనే దైవాన్ని కాదని మానవ శాసనాల్ని పాటించే చోట, దైవాన్ని విడిచి మానవ విధేయత ఆచరించబడే చోటల్లా ఏదో ఒకరూపంలో అన్యాయమూ, అత్యాచారమూ అనివార్యంగా అగుపిస్తాయి.

తమ బలాధిక్యత మూలంగా బలవంతాన ప్రత్యేక స్థానాన్ని పొంది ఉన్న రాజ కుటుంబాలనుచూడండి. సంఘంలో మరెవ్వరికీ లేని గౌరవ మర్యాదలు, అట్టహాసం, వైభవం, ఆదాయమూ, అధికారాలు వారు తమకై కేటాయించుకున్నారు. వీరు చట్టానికి అతీతులు;వీరికి ప్రతికూలంగా అభియోగం చేయడానికి వీలు లేదు, యధేచ్ఛగా వ్యవహరించినా వారిపై న్యాయ విచారణ అంటూ జరగదు. న్యాయస్థానం సమన్‌జారీ చేయజాలదు. తప్పుడు కార్యాలు చేయడం వారికి పరిపాటే అని జగమంతటికీ తెలుసు. 'ఏలినవారు పవిత్రులు. తప్పు వారి పట్ల జరగదు' అని అనేవారు అంటే, నమ్మేవారు లేకపోలేదు. ఇతర మానవుల్లా వారూ సాధారణ మానవులే అని లోకానికంతా తెలుసు కాని వారు 'దేవుళ్ళు' అయి ఉన్నతాసనాల్లో ఉపనిష్ఠులయితే వారి హస్తాల్లోనే జీవనోపాధి, జనన మరణాల సమస్తం ఉన్నట్టు వారి ఎదుట చేతులు జోడించి తలలు వంచి భయభక్తులతో నిల్చుంటారు జనులు, ధర్మాధర్మమనక సర్వవిధాల ప్రజల నుంచి ధనం వసూలు చేసి దాన్ని తమ భవంతులపై, తమ సర్వసుఖాలకు, భోగ విలాసాలకు, ఉల్లాస విహారాలకు అతి నిర్లక్ష్యంగా వ్యయపరుస్తారు.

వారి కుక్కలకు లభించే ఆహారం కష్టపడి, చెమటోడ్చి సంపాదించి స్వాములకు సమర్పించుకునే సామాన్య ప్రజలకు ప్రాప్తం కాదు. ఇదేనా న్యాయం? సర్వ మానవుల హక్కులను, లాభనష్టాలను సమానంగా చూసే న్యాయశీలుడూ, నిజాయితీపరుడు స్థాపించే న్యాయ విధానమిదేనా?

బ్రాహ్మణులను, ముస్లిముల మత గురువులను చూడండి. నవాబులను, రాజులను గమనించండి. జాగీర్దారులను, జమీందార్లను, శ్రీమంతుల్ని, వడ్డీ వ్యాపారం చేసే ధనికుల్ని తిలకించండి. ఈ వర్గాల వారంతా సామాన్య మానవులకు మించిన విశిష్టత తమకు ఉందని భావించుకుంటారు. వీరి బల ప్రభావానికి బెదిరి, ప్రపంచంలో మానవుడు నిర్మించుకున్న చట్టాలన్నీ మానవ కోటికి లేని హక్కుల్ని వీరికి సంక్రమింపజేశాయి. వీరు పవిత్రులునూ, ఇతరులంతా పతితులు. వీరు శ్రేష్ఠులున్నూ తక్కినవారంతా హీనులు. వారంతా ఉన్నతమయిన వారున్నూ, తతిమ్మా జనులంతా నీచులు. దోచుకోవడం వీరి జన్మహక్కు. ఇతరులంతా దోచుకోబడటానికే పుట్టారు. వీరి ఆకాంక్షల్ని పూర్తి చేయడానికి జనులు తమ ధన మాన ప్రాణాలు సర్వం అర్పించవలసిందే. న్యాయశీలుడయినవాడు నిర్మించిన నియమాలేనా ఇవి? వీటిలో ఒకరి స్వార్థం, పక్షపాతం విస్పష్టంగా తెలియడం లేదా?

తమ శక్తిసామర్థ్యాలతో ఇతర జాతుల్ని తమ బానిసలుగా చేసుకున్న ఈ పాలక జాతుల్ని చూడండి. ఏ చట్టాన్నయినా, ఏ నియమాల్నయినా నిస్వార్థంగా ఆచరణలో పెట్టారా వీరు? వీరు తామే మానవ శ్రేష్ఠులమని అనుకుంటారు; ప్రకటిస్తారు. అంతేకాదు వాస్తవంగా మానవులమంటే మేమే అన్న భావన కూడా వీరికి ఉంటుంది. వీరి దృష్టిలో బలహీన

జాతుల వారు మానవులే కారు. వారిని మానవులుగా పరిగణించినా, వారు మానవులలో నీచ వర్గానికి చెందినవారంటారు. తమ స్థానాన్ని ఉన్నతంగా ఎంచుకుని, తమ స్వార్థానికై ఇతరుల స్వభావాలను బలిచేయడం తమ హక్కుగా పరిగణిస్తారు. వీరి ప్రభావం వల్ల లోకంలోని చాలా కాల్పనిక శాసనాల్లో ఈ భావమే ప్రతిబింబిస్తూ ఉంటుంది.

ఈ కొన్ని ఉదాహరణలు మచ్చుకు పేర్కొన్నాను. విశదీకరించడానికి అవకాశం లేదు. ప్రపంచంలో మానవుడే స్వయంగా శాసనాన్ని నిర్మించుకున్న చోట అన్యాయం జరగడం తప్పదన్న విషయాన్ని దీనిద్వారా రూఢీ చేయడమే నా ఉద్దేశ్యం. ఇలా జరిగినప్పుడల్లా కొందరు మానవులకు వారి అర్హతకు మించిన హక్కులు ఇవ్వబడతాయి. ఇంకా,కొందరి హక్కులు కాజేయడమేకాక వారిని మానవత్వపు స్థానాన్నుంచే అధ:పాతాళానికి అణిచివేయబడుతుంది. మానవుని నిర్ణయాల్లో, తీర్పుల్లో స్వార్థం, తన కుటుంబ స్వలాభం, తన వంశం పట్ల మమకారం, తన వర్గం కొరకు అభిమానం, తన జాతి కోసం స్వలాభాపేక్షలు ఇవే అతని మనోమస్తిష్కాల్లో మసలుతుంటాయి. తనవారి ఎడల గల సానుభూతి దృష్టి, ఇతరుల హక్కుల ఎడల, అన్యుల స్వలాభాల పట్ల అతనిలో కానరాదు, మనిషిలోని ఈ బలహీనతలే పైనుదహరించిన అన్యాయాలకు కారణభూతాలు. మనిషి మనిషికి మధ్య తారతమ్యమూ, భేదభావమూ చూపని దేవుని శాసనాన్ని మనుషులమయిన మనమంతా స్వీకరించడం కన్నా ఈ అన్యాయాలకు వేరే పరిష్కార మార్గం ఏది? దేవుని దృష్టిలో మానవులమధ్య వ్యత్యాసం ఏదయినా ఉంటే అది మానవుని నైతికత, అతని ఆచరణ గుణగణాలు, యోగ్యతలు ఆధారంగానే ఉంటుంది; అతని వంశం, తెగ లేక జాతీయత పరిగణించబడవు.

## శాంతి స్థాపన ఎలా సాధ్యమవుతుంది?

మిత్రులారా!

ఈ విషయంలో గమనార్హమైన అంశం మరొకటుంది. మనిషిని అదుపులో ఉంచే శక్తి 'బాధ్యతా భావం' అన్నదానికే ఉందని మీకూ తెలిసిన విషయమే. తాను యథేచ్ఛగా వ్యవహరించినా తన్ను ప్రశ్నించేవారు ఎవరూ లేరని, తనకు శిక్ష విధించగల ఉన్నతాధికారం ఏదీ లేదని మనిషికి పూర్తిగా నమ్మకం కుదిరిపోతే అతను కళ్ళెం తెగిన గుర్రంలా తయారవుతాడన్నది మీరు గ్రహించుకోగలరు. ఈ విషయం ఒక్క మనిషికి సంబంధించినంత వరకు ఎంత యదార్థమో, ఒక కుటుంబానికి, ఒక తెగకు, ఒక జాతికి ఇంకా, మానవులందరికీ సంబంధించినంతవరకున్నూ అంతే సత్యం. ఒక కుటుంబం తనను ప్రశ్నించేవారు ఎవరూ లేరని భావించుకున్నదంటే దాన్ని పట్టడానికి పగ్గాలుండవు. ఒక తెగ కూడా బాధ్యతాభీతికి దూరమయినప్పుడు ఇతరులపై అత్యాచారం సాగించడానికి జంకదు. ఒక జాతి లేదా ఒక రాజ్యం కూడా అంతే. అది తన బలపరాక్రమాల ఆధారంగా తానాచరించే అత్యాచారాల దుష్పరిణామాలను విస్మరించిందంటే అడవి మృగంలా తయారై నోరులేని మేకల్లాంటి వారిని చీల్చి చెండాడడానికి పూనుకుంటుంది. ప్రపంచంలో చెలరేగిన అశాంతికి ఇదొక ముఖ్య కారణం. మనిషి తనకంటే ఉన్నత అధికారాన్ని స్వీకరించనంతవరకు, ఇంకా తనపై ఒక సాధికార శక్తి ఉందని, దానికి తన కర్మల గురించి బదులివ్వవలసిన బాధ్యత తనపై తారసిల్లుతుందని, ఆ శక్తికి తనను శిక్షించగలిగే స్థోమత ఉందనే దృఢ విశ్వాసం మానవుని ఆంతర్యంలో స్థానమేర్పరచుకోనంతవరకు, దౌర్జన్య ద్వారాలు మూయబడి శాంతి సుఖాలు వర్ధిల్లడం సాధ్యపడదు.

ఇక చెప్పండి. ఇలాంటి శక్తి విశ్వకర్త, దైవం తప్ప వేరే ఏది కాగలదు? స్వతహాగా మానవుల్లో ఇలాంటి గుణగణాలు గలవారుగా ఎవరూ రూపొందజాలరు. ఎందుకంటే ఏ మానవ వర్గానికి ఈ స్థానం మీరు ఇస్తారో అదే కళ్ళెం లేని గుర్రంలా తయారయ్యే అవకాశం ఉంది. అదే క్రౌర్యులైన ఫిరౌన్లందరినీ మించిన మహా ఫిరౌన్‌గా మారే స్థితి ఏర్పడుతుంది. అది స్వార్థమూ, పక్షపాతాలతో కొందరిని అణచి మరికొందరిని పైకి లేవనెత్తే వైఖరి అవలంబించే ప్రమాదమూ లేకపోలేదు.

ఈ సమస్యను పరిష్కరించేందుకు నానాజాతి సమితి (League of Nations) స్థాపించింది యూరోపు. కాని అతి స్వల్పకాలంలోనే అది 'శ్వేతవర్ణ జాతి సమితి'గా మారిపోయింది. కొన్ని అగ్రరాజ్యాల చేతుల్లో కీలుబొమ్మలా తయారై చిన్న చిన్న రాజ్యాల పట్ల అన్యాయంగా ప్రవర్తించటం మొదలెట్టింది. ఈ ప్రయోగానికి అనంతరం ఒక విషయం మాత్రం నిస్సందేహంగా రుజువు అయింది. స్వయంగా మానవుల ద్వారా ఏర్పడిన శక్తి ప్రశ్నాధికారానికి, ఒక్కొక్క వ్యక్తి మొదలుగా జాతులూ రాజ్యాలు సర్వం భీతి చెంది అదుపులో ఉండగలవన్న విషయం కానేరని కార్యం అని తేలిపోయింది. అందువల్ల అలాంటి శక్తి మానవ పరిధికి ఆవల, మానవులకంటే ఉన్నతమయినదిగా ఉండాలి. ఆ శక్తి విశ్వప్రభువు దేవునిదే కాగలదు. మన శ్రేయమే మనకు ప్రియమయినదయితే దైవాన్ని నమ్మి ఆయన ప్రభుత్వానికే దాసోహమని స్వయం సమర్పణ చేసుకోవడం కన్నా మార్గాంతరం లేదు మనకు. ఆ ప్రభువుకు మనం బహిర్గతంగా చేసే పనులు, తమ అంతర్గత భావనలు సర్వం తెలుసు. ఇంకా, ఒకరోజు ఆయన మహత్తర న్యాయస్థానంలో హాజరై జీవితంలో మనం చేసుకున్న కర్మలన్నింటి లెక్కపత్రాలు పూర్తిగా చూపవలసి వుంది. ఈ దృఢ విశ్వాసంతో జీవితం

గడపడమే శరణ్యం. గౌరవవంతంగా, శాంతియుత మానవులుగా మనం మనగలగడానికి ఈ విధానం ఒక్కటే సాధ్యం.

## ఒక సందేశం

ఈ ప్రసంగాన్ని ముగించేముందు మీలో ప్రతి ఒక్కరి మనసులోనూ మసలుతున్న ఒక సందేహాన్ని పరిష్కరించడం అవశ్యమని తలుస్తున్నాను. ధూళి రేణువులు మొదలుకొని సూర్యచంద్రాదుల వరకు సర్వాన్నీ దేవుని పటిష్టమయిన వ్యవస్థాపన అధీనంలో ఉంచుకోగలిగింది. ఈ ప్రభుత్వంలో మనిషి కేవలం ఒక సామాన్య పాలితునిగా జీవిస్తున్నాడు. అలాంటప్పుడు దేవుని ప్రభుత్వాన్నెదిరించి తిరుగుబాటు, ద్రోహం తలపెట్టడం మనిషికి ఎలా సాధ్యమయింది? తన రాజస్వమూ, స్వాతంత్ర్యమూ ప్రకటించి దేవుని దాసులైన ఇతర మానవులపై తన అధికారాన్ని ఎలా చెలామణి చేయగలిగాడీ మానవుడు? ఇలా చేయకుండా దైవం అతన్ని ఎందుకు అరికట్టలేదు? అతన్ని ఎందుకు శిక్షించలేదు? ఈ ప్రశ్నలకు సమాధానం సంగ్రహంగా ఇస్తాను.

అసలు, దేవుని ఈ ప్రభుత్వంలో మానవుని నిజ స్థానం ఏమిటంటే, రాజు ఒక వ్యక్తిని, తన దేశంలో ఏదో ఒక మండలానికి అధికారిగా నియమించినటువంటిది; దేశం, ప్రజలు, రైళ్ళు, తంతి తపాలా శాఖలు, సైన్యం ఇంకా ఇతర శక్తులన్నీ రాజు హస్తాల్లోనే ఉంటాయి. ఆ మండలానికి నలువైపులా రాజ్యాధికారం అతి బలిష్టంగా కట్టుదిట్టంగా ఉంటుంది. ఆ చిన్న మండలాధికారి ఆ అధికారం ముందు పూర్తిగా వివశుడయి వుంటాడు. రాజు తలచుకుంటే తన ఆజ్ఞల్ని అతడు వెంట్రుకవాసి కూడా తప్పిపోకుండా చూసుకోగలడు. కాని, ఏలిక అతని బుద్ధిజ్ఞానాల్ని,

మనోవిశాలతను, యోగ్యతా విశిష్టతలను పరీక్షించగోరుతాడు. అందుకు అతనిపై ఉన్న తన బంధనాల్ని సడలిస్తాడు. ఆ తరువాత తనపై ఉన్నతాధికారం కూడా ఒకటుందనే భావన శూన్యమయి పోతుంది ఆ మండలాధికారికి. అయితే అతను బుద్ధీజ్ఞానాలు కలిగి స్వామి భక్తి, కర్తవ్య జ్ఞానం, విశ్వసనీయత గల వ్యక్తి అయితే బంధనాలు సడలి ఉన్నా తనను ఆయన దాసునిగా, పాలితునిగా, సేవకునిగానే భావించుకుంటాడు. తన ప్రభువు రాజ్యంలో ఆయన శాసనానుసారమే పాలన చేస్తాడు. ఏలిక ఇచ్చిన అధకారాల్ని ఆయన ఇచ్ఛానుగుణంగానే ప్రయోగిస్తాడు. విశ్వాస పర్వతం, స్వామిభక్తీ వైఖరి ద్వారా అతని యోగ్యత రుజువవుతుంది. ఇంకా ఉన్నత పదవులకు అతని అర్హత ఉన్నట్లు గమనించి అత్యున్నత స్థానాలను ప్రసాదిస్తాడు ప్రభువు. అలాకాక ఆ అధికారి అవివేకి, స్వామిద్రోహి, వక్రబుద్ధి అయితే ఆ మండలంలోని ప్రజలు బుద్ధీజ్ఞానాలు లేనివారయి ఉంటే రాజ్య బంధనాలు సడలి వుండడం గమనించి మండలాధికారి తిరుగుబాటు తలపెడతాడు. అతనిబుర్రలో అధికార కాంక్ష ప్రబలంగా నిండుకుంటుంది. తాను ఆ మండలానికి స్వామి అని భావించి తలబిరుసుతనంతో సొంత ప్రభుత్వాన్ని నెలకొల్పి పరిపాలించడం మొదలెడతాడు. అయితే, వేతనాలు పంపిణీ చేసేవాడు, పోలీసులపై ప్రత్యక్షంగా అధికారం గలవాడు, న్యాయస్థానాల్నీ, కారాగారాల్ని నడిపేవాడు బేడీలు, ఉరికంబాలు స్వాధీనంలో కలవాడు అతనే గనుక, తమ భావి జీవితంలో సౌభాగ్యపు సుభిక్షో, దౌర్భాగ్యపు దుర్భిక్షో అంతా అతని హస్తాల్లోనే ఉందని భావిస్తారు ప్రజలు. అంతమాత్రానికే అక్కడి మూఢ ప్రజానీకం అతని స్వేచ్ఛా ప్రభుత్వాన్ని సమ్మతిస్తారు. ఈ మూఢ ప్రజల్నీ, ఆ విద్రోహిఅయినఅధికారిని,అందరి వైఖరిని గమనిస్తూ ఉంటాడు

నిజ ప్రభువు. తలచుకుంటే వారందరిని తక్షణం బంధించి పొగరు అణిగేలా శిక్షించగలడు. కాని అలా చేయడు, వీరిని కొంతకాలం పరీక్షించాలని భావిస్తాడు. అందువల్ల అత్యంత సహనంతో, ఓరిమితో వారిలో నిండుకుని ఉన్న అయోగ్యతలన్నీ పూర్తిగా బయటపడేవరకు వారిని స్వేచ్ఛగా వదులుతూ ఉంటాడు. ఆ మండలాధికారి ఎన్నటికయినా బలాన్నిఉపయోగించి తన సింహాసనాన్ని ఆక్రమించుకుంటాడేమో అన్న భయం లేదు ఆయనకు. ఆయన శక్తిసామర్థ్యాలు ఎంతో అమోఘమయినవి. ఈ ద్రోహులు, విశ్వాస ఘాతకులు తన పట్టు నుండి తప్పుకుని ఎక్కడికయినా పారిపోగలరన్న సంశయమూ ఆయనకు లేదు. అందుచేత త్వరపడి తీర్పు చేసివేసే ఆవశ్యకత కూడా ఆయనకు లేదు. సంవత్సరాల తరబడి, శతాబ్దాల తరబడి వారికి అవకాశం ఇస్తూ ఉంటాడాయన. చివరికి తన నీచత్వాన్ని పరిపూర్ణంగా, ఏమాత్రం మిగలకుండా, వారు బయటపెట్టిన నాటికి తన ఆగ్రహాన్ని, శిక్షను వారిపై అవతరింపజేస్తాడు. ఆ సమయంలో ఎలాంటి ఉపాయమున్నా ఆ యాతన నుంచి వారిని రక్షించడానికి ప్రయోజనకరం కాజాలదు.

## సమాప్తం

(మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది గారు కపూర్థలా సంస్థానంలో హిందువులు, సిక్కులు, ముస్లిముల సమిష్టి సమావేశంలో చేసిన ప్రసంగం).